ప్రజాశక్తి

శుక్రవారం 26 మే 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

చల్లని గాలులు.. వాన జల్లులు

- ఆహ్లాదంగా విశాఖ తీరం
- ఒక్కసారిగా మారిన వాతావరణం
- అనకాపల్లి జిల్లాలోనూ జోరువాన



వానలోనే రాకపోకలు సాగిస్తున్న నగరవాసులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ తీరం ఒక్కసారిగా ఆహ్లాదకరంగా మారిపోయింది. పట్టపగలే నల్లటి మబ్బులతో చిమ్మచీకట్లు విశాఖను ముంచెత్తాయి. గురువారం మధ్యాహ్నం నుంచి సుందర దృశ్యాలతో.. చల్లని వాతావరణంతో విశాఖ వాసులు చాలా వరకూ సేదతీరారు. కొద్దిరోజులుగా వేడి గాలులు, ఎండ తీవ్రతతో అల్లాడిపోతున్న నగర వాసులను ఒక్కసారిగా ఈ చల్లని గాలులు ఆనందంలో ముంచెత్తాయని చెప్పొచ్చు. గురువారం పగలంతా ఎండ ఉన్నప్పటికీ మధ్యాహ్నం 2.30 గంటల తరువాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. విశాఖ అంతటా కురిసిన వాన అందరికీ ఉపశమనం కలిగించింది. సాయంకాలం వేళ సాగర తీరానికి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి సేదతీరారు.

5 మిల్లీమీటర్ల వర్షపాతం, 34కు పడిపోయిన ఉష్ణోగ్రతలు

విశాఖ నగరంలో 5 మిల్లీమీటర్లు దాటి గురువారం వర్షపాతం నమోదైంది. 40 డిగ్రీల వరకూ ఉన్న ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా 34 డిగ్రీలకు పడిపోయాయి. ప్రస్తుతం రాష్ట్రంలో పశ్చిమ, నైరుతి గాలులు వీస్తున్నందున వాతావరణం ఒక్కసారిగా చల్లబడిందని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 26 నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవులలో మరికొన్ని ప్రాంతాలకు విస్తరించి ముందుకు సాగడానికి ఈ వాతావరణం, పశ్చిమ, నైరుతి గాలులు తోడ్పడనున్నాయి. ఉష్ణోగ్రతల్లో పెద్ద మార్పులు ఉండకపోయినా వాతావరణం అప్పుడప్పుడూ ఇలా చల్లబడే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

అనకాపల్లి జిల్లాలో..

అనకాపల్లి జిల్లాలోని గొలుగొండ మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొంగసింగి గ్రామంలో పిడుగుపడటంతో ఓ వ్యక్తికి గుండెపోటు వచ్చి చనిపోయాడు. దేవరాపల్లి మండలంలోనూ ఈదురు గాలులతో వర్షం కురిసింది.



అప్పారావు పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అల్లం అప్పారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, సీతమ్మధార : జెఎన్‌టియు మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం అప్పారావు పార్థివ దేహానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితరులు నివాళ్లర్పించారు. నాలుగు రోజుల కిందట అమెరికాలో అప్పారావు మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతదేహాన్ని గురువారం లాసన్స్ బే కాలనీలోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. మంత్రి అమర్‌నాథ్ అప్పారావు గృహానికి వెళ్లి ఆయన పార్థివ దేహం వద్ద మిగతా 2లో..

ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం, గ్రామీణ ప్రాంతాల్లో నడుస్తున్న ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఫిజియోథెరఫీ కేంద్రాలు, డెంటల్ క్లినిక్స్, స్కానింగ్, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2002/2007 ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం (ఆన్‌లైన్)లో రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మిగతా 2లో..

విశాఖ విద్యార్థికి తెలంగాణ ఎంసెట్‌లో ప్రథమ స్థానం

వార్త మెయిన్‌లో..

కొందరికే సేవా పురస్కారాలు

వార్త 3లో..

కంప్యూటర్ నైపుణ్య పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

వార్త 2లో..

482 ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు

- జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ
- మొదటి విడతగా 77 మందికి కారుణ్య నియామకాలు
- కార్మికులకు ప్రమాద, జీవిత బీమా సౌకర్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో ఖాళీగా ఉన్న 482 ఉద్యోగాలను త్వరలో భర్తీ చేయనున్నామని కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జివిఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జివిఎంసి పరిధిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా 5217 అప్లికేషన్లు వచ్చాయని, ఈ నియామకాల్లో మొదటి విడతగా కారుణ్య నియామకాల విభాగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు 146 మందిని ఫైనల్ చేయగా ఇప్పటి వరకు 77 మంది మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారని, వీరికి వెంటనే ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. అదే విధంగా మిగిలిన 69 మంది కూడా ఈ నెల 31లోపు తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసుకుంటే వారికి కూడా వెంటనే నియామక పత్రాలు అందజేస్తామని మిగతా 2లో..



మాట్లాడుతున్న సాయికాంత్ వర్మ

మీటర్ రీడర్ల పొట్టకొట్టొద్దు

- జీతాల్లో కోత తగదు
- ఎపిఇపిడిసిఎల్ మీటర్ రీడర్స్ యూనియన్ ఐదు జిల్లాల సదస్సు డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎపిఇపిడిసిఎల్ పరిధిలో స్పాట్ బిల్లింగ్ పనులు చేస్తున్న మీటర్ రీడర్ల పొట్టకొట్టొద్దని, సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎపిఇపిడిసిఎల్ మీటర్ రీడర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఐదు జిల్లాల మీటర్ రీడర్ల సదస్సు డిమాండ్ చేసింది. తొలుత యూనియన్ గౌరవ అధ్యక్షులు జిఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ యాజమాన్యం పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచడం లేదన్నారు. డోర్ లాక్, నాన్ స్కాన్ పేర్లతో జీతాల్లో కోతలు విధించడం అన్యాయమన్నారు. యూనియన్ విశాఖ జిల్లా నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ ఎపిఇపిడిసిఎల్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 1600 మంది మీటర్ రీడర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాటను నెరవేర్చాలని మిగతా 2లో..



సదస్సులో మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షులు రాజేశ్వరరావు

మొదటి పేజీ తరువాయి..

మీటర్ రీడర్ల పొట్టకొట్టొద్దు

డిమాండ్ చేశారు. మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎపివిఎంఆర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ మాట్లాడుతూ ఎండనకా, వాననకా ఇంటింటికీ తిరుగుతూ సుమారు కోటీ 50 లక్షలకుపైగా సర్వీసులకు రీడింగులు తీస్తూ తాము జీవనం సాగిస్తున్నామన్నారు. స్పాట్ బిల్లింగ్ గడువు కుదింపు ప్రతిపాదనలను పున్ణపరిశీలించాలని సూచించారు. పని దినాలను కుదించడం వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రీడింగ్‌లు తీసే సర్వీసులు ఒక్కసారిగా సగానికి తగ్గిపోతాయని, ఫలితంగా ఆదాయం పడిపోతుందని తెలిపారు. తమకు నష్టం చేకూర్చే చర్యలను ఉపసంహరించుకోవాలన్నారు. సదస్సులో ఇపిడిసిఎల్ మీటర్ రీడర్స్ యూనియన్ అధ్యక్షులు ఎల్.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కెఎస్‌డిఎస్‌కె.రెడ్డి, కోశాధికారి ఎమ్‌డి.సుభాన్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ఆర్.కుమార్ స్వామి, విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు, విశాఖ జిల్లా అధ్యక్షులు డి.క్రాంతి కుమార్, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు పి.నాగబాబు, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యకులు ఒ.శ్రీనివాసరావు, ఇతర డివిజన్ల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం యూనియన్ నాయకులు ఎపిఇపిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

482 ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు

తెలిపారు. మొదటి విడతగా కారుణ్య నియామకాలు పూర్తయిన తర్వాత మిగిలిన పోస్టులు భర్తీ చేస్తామని అన్నారు. ఈ నియామకాల భర్తీ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు ఎండ నుంచి రక్షణకు క్యాప్‌లు అందజేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా జివిఎంసి పరిధిలోని 8050 మంది రెగ్యులర్, తాత్కాలిక ఉద్యోగులకు, కార్మికులకు కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలైన ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన ద్వారా 2 లక్షల ప్రమాద బీమా, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం ద్వారా 2 లక్షల జీవిత బీమా చేయించనున్నామని, ఈ బీమా ప్రీమియానికి అవసరమైన రూ.36,70,800 మొత్తాన్ని జివిఎంసి ద్వారా చెల్లించేందుకు కౌన్సిల్ నిర్ణయించిందని చెప్పారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా నగరంలో వీధి దీపాల సమస్యను నెల రోజుల్లో పరిష్కారిస్తామని, దీనికి ఇప్పటికే టెండర్లు పిలిచామని తెలిపారు. వీటితోపాటు జివిఎంసి నిర్వహణలో ఉన్న సిసి కెమెరాలకు పూర్తిగా మరమ్మతులు చేస్తామన్నారు. వార్డుల వారీగా పర్యటించి ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు.

అల్లం అప్పారావుకు ఘన నివాళి

పుష్పగుచ్ఛం ఉంచి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విద్యాపరంగా విశాఖకు మంచి గుర్తింపు తీసుకువచ్చిన అల్లం అప్పారావు మరణ వార్త విశాఖ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీలో లెక్చరర్‌గానీ, రీడర్‌గాగానీ పనిచేయకుండానే నేరుగా ప్రొఫెసర్ అయిన ఏకైక వ్యక్తి అల్లం అప్పారావు అని కొనియాడారు. కాకినాడ జెఎన్‌టియు ప్రప్రథమ వైస్ ఛాన్సలర్‌గా పనిచేసి ఇంజినీరింగ్ విద్యలో అనేక కీలక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. అల్లం అప్పారావు వేలాదిమంది విద్యార్థులతో పిహెచ్‌డిలు చేయించి వారికి డాక్టరేట్లు వచ్చినట్టుగా చేసి, ఆయన కూడా డాక్టరేట్ సాధించారని తెలిపారు. అల్లం అప్పారావు పార్థివ దేహం వద్ద మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నివాళ్లర్పించారు. అవంతి కళాశాలలకు అప్పారావు అనేక సూచనలు అందించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు.

ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ లేనివాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ లేని వారందరూ వెంటనే ఆన్‌లైన్‌లో జూన్ 10లోగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు .

డిఎస్‌పిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అమరావతి ప్రాంత తుళ్లూరులో రైతులు, మహిళలపై డిఎస్‌పి పోతురాజు వీరంగం వ్యవహారంపై దర్యాప్తు జరిపి, ఆయనపై చర్యలు తీసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్ డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప ఎంపీ అవినాష్ రెడ్డి అరెస్టు విషయంలో ముందుకెళ్తే రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య ఏర్పడుతుందని కర్నూల్ ఎస్‌పి చెప్పడాన్ని ప్రాతిపదికగా తీసుకొని రాష్ట్రంలో తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని అన్నారు. సమావేశంలో టిడిపి విశాఖ పార్లమెంట్ కార్యదర్శి బొడ్డేపల్లి దొరబాబు, 14వ వార్డు అధ్యక్షులు పివి.వసంతరావు పాల్గొన్నారు.

10 వేల జెడ్‌ఎస్‌ఇవిల విక్రయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశ వ్యాప్తంగా 10 వేల జెడ్‌ఎస్‌ఇవి వాహనాలను విక్రయించినట్టు ఎంజి మోటార్ ఇండియా ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రతినిధి వెల్లడించారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రారంభించినప్పటి నుంచి ఎంజెడ్‌ఎస్‌ఇవి భారతదేశపు మొట్టమొదటి స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ ఇంటర్నెట్ ఎస్‌యువిగా నిలిచిందన్నారు. ఇవి ఔత్సాహికులలో ప్రముఖ గ్రీన్ ప్లేట్‌గా మారిందని తెలిపారు.

జివిఎంసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకట రెడ్డిపై అసత్య ఆరోపణలు మానుకోవాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, యూనియన్ నాయకులపై అక్రమ బైండోవర్లు ఎత్తివేయాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. వెంకటరెడ్డిపై అసత్య ఆరోపణలు, అక్రమ బైండోవర్లకు వ్యతిరేకంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గంగారావు, కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జివిఎంసి పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్యం, క్లాప్ డ్రైవర్స్, పార్కులు, వెటర్నరీ, వాటర్ సప్లయ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుంటే జివిఎంసి అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు కక్షపూరిత చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. ఎన్నడూలేని విధంగా నిర్బంధ చర్యలకు పూనుకోవడం దారుణమన్నారు. కేసులకు, నిర్బంధాలకు భయపడని యూనియన్ గౌరవాధ్యక్షులు వెంకటరెడ్డిపై పలు ఆరోపణలు చేస్తూ మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసి, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కింద కేసు పెట్టడమంటే కార్మిక ఉద్యమాలను అణిచివేయడమేనన్నారు. వెంకటరెడ్డి 50 ఏళ్ల నుండి బడుగు బలహీన వర్గాలు, అణగారిన కార్మికులకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.

జివిఎంసిలో లక్షల రూపాయల లంచాలు తీసుకొని ఉద్యోగాలు వేస్తున్న వారి బండారం బయటపడుతుందనే ఉద్ధేశ్యంతోనే వెంకటరెడ్డిపైనా, యూనియన్‌పైనా ఇటువంటి బురదజల్లే చర్యలకు పాల్పడుతున్నారన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నూకరాజు, యు.రాజు, నాయకులు ఎంవి.ప్రసాదరావు, వి.కృష్ణారావు, జె.నాయుడు, అప్పారావు, రత్నం, సత్యవతి, ఎస్.రమణ, గణేష్, ఎం.ఈశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

పర్యావరణ దినోత్సవ పోటీలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోటీలను జయప్రదం చేయాలని ఎపి కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ టీంలు గురువారం ఒక ప్రకటనలో సంయుక్తంగా కోరాయి. ఈ మేరకు విశాఖలోని ద్వారకానగర్‌లో బివికె.కాలేజీ ఎదురుగా ఉన్న పౌర గ్రంథాలయంలో ఈ నెల 29 సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి డ్రాయింగ్, వ్యాసరచన, ఎలక్యూషన్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపాయి. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నాయి.

'సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్' ఇతివృత్తంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నాయి. ఇతర వివరాలకు 7032781461, 8333849955 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

కంప్యూటర్ నైపుణ్య పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్

శుక్రవారం ఎపిపిఎస్‌సి నిర్వహిస్తున్న కంప్యూటర్ నైపుణ్య పరీక్ష ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం పరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో డిఆర్‌ఒ తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్ష పెదగంట్యాడలోగల ఎస్‌విఎస్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ కేంద్రంగా జరుగుతుందని, 402 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు.

సమస్యలపై వీధి విక్రయదారుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి పరిధిలోని 8 జోన్లలో ఉన్న వీధి విక్రయదారులు, చిరు వ్యాపారుల హక్కులను పటిష్టంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం వీధి విక్రయదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జివిఎంసి పరిధిలో ఉన్న వీధి విక్రయదారులను గుర్తించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఎనిమిది జోన్లలో కలిపి సుమారు 2 లక్షల మంది వీధి విక్రయదారులు, చిరు వ్యాపారులు ఉన్నారని తెలిపారు. వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కన్వీనర్ భీంపల్లి రాము పాల్గొన్నారు.

ముగ్గురికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన ఆరోగ్య సమస్యల పరిష్కారం దిశగా ఎమ్మెల్యే గణేష్ కుమార్ ముందుకు కదిలారు. గురువారం నియోజవర్గంలోని ముగ్గురికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. దొండపర్తికి చెందిన ప్రవీణ్ కుమార్, ప్రకాశరావు పేటకు చెందిన కాళ్ల స్వాతి, మహారాణిపేట ఆంథోనీనగర్‌కు చెందిన కోట దేవిలకు ఈ ఆర్థిక సాయాన్ని వారి స్వగృహాలకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో ఆయా వార్డుల వైసిపి నాయకులు నీలాపు సర్వేశ్వర రెడ్డి, పీతల వాసు, బెవర మహేష్, నేలపు లక్ష్మి పాల్గొన్నారు.

డిఎంయు ఆపరేటర్లకు ఐరిష్ పరికరాల పంపిణీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిల్లాలో చేతి వేలి ముద్రలు పడని వృద్ధులు, అనారోగ్య పీడితులు, కొంతమంది గృహనిర్మాణ కార్మికులకు రేషన్ జారీ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందీ లేకుండా చేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎండియు ఆపరేటర్లకు గురువారం ఐరిష్ పరికరాలను జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డుపై ఎండియు వాహనాల వద్ద రేషన్ సరుకులు తీసుకోవడానికి వెళ్తున్న అనేకమందికి వేలిముద్రలు పడటం లేదని, దీంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ సమస్య పరిష్కారానికి ఐరిష్ పరికరాలను అందజేస్తున్నామన్నారు.

స్థాయీ సంఘం సమావేశంలో అన్నీ ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘ సమావేశం గురువారం స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరిగింది. అజెండాలో 47 అంశాలు, 15 టేబుల్ అంశాలు పొందుపరచగా అన్నీ ఆమోదం పొందాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి దాదాపు రూ.661.08 లక్షల పనులకు ఆమోదం తెలిపినట్టు ఛైర్‌పర్సన్ తెలిపారు. రెవెన్యూ విభాగానికి చెందిన లీజుల పొడిగింపుతో పాటు పలు అంశాలను ఆమోదించారన్నారు. ఈ సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతో పాటు డిసి (రెవెన్యూ) ఫణిరాం, కార్యదర్శి నల్లనయ్య, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, శివప్రసాద్, సింహాచలం, మల్లయ్య నాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరివెంకట కుమారి

కొందరికే సేవా పురస్కారాలు

- నిబంధనల పేరిట కోతతో వాలంటీర్ల ఆవేదన
- సేవామిత్ర ప్రోత్సాహమైనా అందక పలువురి నిరాశ



సేవా అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న వాలంటీర్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : పెర్ఫార్మెన్స్ పేరిట కొంతమందిని సేవా అవార్డులకు అనర్హులుగా ప్రకటించడంతో పలువురు వాలంటీర్లు ఆవేదన చెందుతున్నారు. ఏడాది పొడుగునా తాము చేసిన సేవలకు ప్రభుత్వం ఇచ్చిన గౌరవం ఇదేనాయని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రతినెలా ఒకటోతేదీన వేకువజామును ముందునుంచే పింఛన్ల పంపిణీతోపాటు, ప్రభుత్వం, అధికారులు నిర్దేశించిన కార్యక్రమాలను నిబద్దత, చిత్తశుద్ధితో చేసిన తమ సేవలు, మూడో ఏడాది వచ్చేసరికి ఏ విధంగా తగ్గిపోయాయో అంతు చిక్కడం లేదని అంటున్నారు. అందరూ ఒకేతీరున పనిచేస్తే, కొందరికే సేవా అవార్డులు ఇవ్వడంపై దక్కని వారంతా చిన్నబోతున్నారు. కాగా ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది వాలంటీర్లకు వందనంపేరిట సేవా అవార్డులను ప్రకటించింది. సేవావజ్రలకు రూ.30వేలు, సేవారత్నలకు రూ.20వేలు, సేవామిత్రలకు రూ.10వేలు ఆర్థికప్రోత్సాహం అందిస్తోంది.

పెర్ఫార్మెన్స్ పేరుతో అందని ప్రోత్సాహం

అమరావతిలోని గ్రామ, వార్డు సచివాలయ విభాగం(జిఎస్‌డబ్ల్యుఎస్) రూపొందించిన పెర్ఫార్మెన్స్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వాలంటీర్లకు పురస్కారాలను ప్రదానం చేసింది. ఏడాదంతా పని చేసిన తమకు కనీసం సేవా మిత్ర అవార్డు కింద రూ 10 వేల ప్రోత్సాహానికైనా నోచుకోలేక పోయామా? అంటూ పలువురు గ్రామ, వార్డు వాలంటీర్లు వాపోయారు. వాలంటీర్లను, వారి సేవలను సమయం వచ్చినప్పుడల్లా పొగడ్తలతో ముంచెత్తుతున్న ప్రభుత్వం,అవార్డులిచ్చేసరికి మొండిచేయి చూపడంపై పలువురు పెదవి విరుస్తున్నారు.

97మందికి అందని సేవా అవార్డులు

జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో 410 మంది వార్డు వాలంటీర్లకుగాను, 313మందికే సేవా అవార్డులివ్వగా, మిగిలిన 97మందికి నిరాశే మిగిలింది. వార్డుల వారీగా ఒకటో వార్డులోని ఐదు సచివాలయాల్లో 103మంది వాలంటీర్లకు గాను, 89మందికి సేవామిత్ర, ఇద్దరికి సేవా రత్న అవార్డులిచ్చారు. రెండో వార్డులో ఐదు సచివాలయాల పరిధిలో 116 మందికి గాను 79 మందికి సేవామిత్ర, ఇద్దరికి సేవారత్న ఇచ్చారు. మూడోవార్డులోని ఐదు సచివాలయాల్లో 96 మందికిగాను, 64మందికి సేవామిత్ర, ఒకరికి సేవా రత్న అవార్డు ఇచ్చారు. నాలుగోవార్డులో ఆరు సచివాలయాల పరిధిలో 95మంది వాలంటీర్లు ఉండగా, 72 మంది సేవామిత్ర, ముగ్గురికి సేవారత్న, ఒకరికి సేవావజ్ర అవార్డుకు ఎంపిక చేశారు.

ఎంపికలో ప్రమేయం లేదు



వాలంటీర్లకు సేవా అవార్డుల ఎంపికలో ప్రజాప్రతినిధులు, అధికారులు, అధికారపార్టీ నేత ప్రమేయం ఏమాత్రం లేనే లేదు. ప్రభుత్వం నిర్దేశించిన అయిదు అంశాల్లో వాలంటీర్ల పనితీరు ఆధారంగానే అమరావతిలో ఉన్న గ్రామ వార్డు సచివాలయ విభాగం వాలంటీర్లను సేవా అవార్డులకు ఎంపిక చేసింది.


ఎల్లపు సంతోష్‌కుమార్, ఏపిడి, యుసిడి విభాగం, జివిఎంసి, జోన్-1

అవార్డులకు ఎంపిక ఇలా...

వివిధ అంశాల్లో వాలంటీర్ల పనితీరు ఆధారంగాసేవా అవార్డులకు ప్రభుత్వంవారిని ఎంపిక చేసింది. నెలలో 100 శాతం హాజరు ఉన్నట్లైతే 30 మార్కులు, ప్రతి నెలా ఒకటో తేదీకే వందశాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసేత 30 మార్కులు, హౌస్‌హోల్డ్ సర్వే వందశాతం చేస్తే 20 మార్కులు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సమాచారాన్ని సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే, 10 మార్కులు, లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే 10 మార్కులు, మొత్తంగా ఐదు విభాగాల్లో వాలంటీర్ల పనితీరు ఆధారంగా ఈ అవార్డులకు ఎంపిక చేసిందని అధికారులు అంటున్నారు

నేరాలు ఘోరాలు

రోడ్డుపై తవ్విన గోతుల్లో వ్యాన్ బోల్తా



గోతుల్లో బోల్తా పడిన వ్యాన్

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి యంత్రాంగం నిర్లక్ష్యంగా చేపడుతున్న పనులతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురికావడమే కాకుండా ప్రమాదాలకు కారణమౌతున్నాయి. గురువారం సాయంత్రం ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఎదురుగా రోడ్డుపై తీసిన గోతులను సరిగా పూడ్చకపోవడం, అక్కడ ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో అటుగా వెళుతున్న ఒక వ్యాను ప్రమాదానికి గురై బోల్తా పడింది. వ్యాన్ పూర్తిగా ఒరిగిపోవడంతో వాహనరాకపోకలకు ఇబ్బందులు కలగగా, అదే సమయంలో ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో ప్రజలు, వాహనదారులు మరింత ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన రహదారిలో, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పనులు చేపట్టినపుడు వీలైనంత వేగంగాపనులు చేయడంతోపాటు, ఇటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కొద్ది వర్షానికే రోడ్లన్నీ జలమయం



నీటితో నిండిన గాజువాక వంద అడుగుల రోడ్డు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలో గురువారం సాయంత్రం దాదాపు పావుగంట కురిసిన భారీ వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. పాత గాజువాక, వంద అడుగుల రోడ్డు, కణితి రోడ్డు వంటిల్లు తదితరప్రాంతాల్లో రోడ్లనీ నీటితో నిండిపోయాయి. కొద్దిసేపు కురిసిన వర్షానికే రోడ్లన్నీ నీటితో నిండిపోయి, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో మున్ముందు వర్షాల సీజన్‌లో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటుందో గుర్తించి, ముందస్తుగా తగు చర్యలు ఇప్పటినుంచే చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు



ప్రమాదాలకు ఆస్కారమున్న ప్రాంతాలను పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -తగరపువలస : 16వ నెంబరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం నార్త్ ట్రాఫిక్ సిఐ నల్లి సాయి, భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ సిహెచ్ చిరంజీవి, నేషనల్ హైవే అధికారి భార్గవ్ తదితరులు పలు ప్రాంతాలను పరిశీలించారు. రాంబిల్ స్ట్రిప్స్, గో స్లో బోర్డులు, వేగ నియంత్రణ బోర్డులు, స్కూల్ జోన్ బోర్డులు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే అంశాలపై చర్చించారు. సంగివలస మూడుగుళ్ళు, వలందపేట, తాళ్ళవలస, గోస్తనీ జంక్షన్ ప్రాంతాలను వారు పరిశీలించారు.

ఎన్‌సిసి వార్షిక శిక్షణ శిబిరం

ప్రజాశక్తి -తగరపువలస : సంగివలస అనిట్స్ కళాశాలలో ఈ నెల 23న ప్రారంభమైన ఎన్‌సిసి, వార్షిక శిక్షణా శిబిరాన్ని వచ్చేనెల ఒకటో తేదీ వరకు వరకు నిర్వహించనున్నారు. భారత నావికాదళంలో అనుసరించే పద్ధతులు, శారీరక శిక్షణ, యోగా, డ్రిల్, నేవల్ ఓరియంటేషన్ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ శిబిరం దోహదపడనుందని నిర్వాహకులు తెలిపారు. శిక్షణలో 600 మంది వరకు ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు

గీతం ఆసుపత్రిలో అత్యాధునిక కేథ్‌ల్యాబ్

జిమ్‌సర్ ఆసుపత్రిలో హృద్రోగులకు మెరుగైన సేవలు



క్యాథ్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో గీతం అధ్యక్షుడు శ్రీభరత్

ప్రజాశక్తి- మధురవాడ : నామమాత్రపు రుసుముతో సామాన్యులకు మెరుగైన వైద్యసేవలను అందిస్తున్న గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (గీతం ఆసుపత్రి) తాజాగా హృద్రోగులకు అత్యాధునిక కేథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. అన్ని రకాల గుండెజబ్బులకు చికిత్స అందించే విధంగా ఉత్తరాంధ్ర జిల్లాలలో కోట్లాది రూపాయల వ్యయంతో గీతం వర్సిటీకి అనుబంధంగా ఉన్న జిమ్‌సర్ ఆసుపత్రిలో కేథరైజేషన్ ల్యాబొరేటరీని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ గురువారం, అపోలో ఆసుపత్రి కార్డియాలజీ విభాగం నిపుణులు డాక్టర్ బారువాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ గీతం బోధన ఆసుపత్రిలో పిజి వైద్య విద్యను అభ్యసించే వారికి అత్యుత్తమ శిక్షణ ఇవ్వడంతో పాటు సామాన్యుల గుండె జబ్బుల చికిత్సకు దూరప్రాంతాలకు వెళ్ళనవసరం లేదన్నారు. జిమ్‌సర్ ఆసుపత్రిలో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అంతర్జాతీయ ప్రమాణాలతో గుండె జబ్బులకు కూడా చికిత్స అందుతుందని స్పష్టం చేశారు. డాక్టర్ బారువా మాట్లాడుతూ గుండె జబ్బుల కేసులు పెరుగుతున్న నేపథ్యంలో విశాఖలోని గీతం బోధన ఆసుపత్రిలో అత్యాధునిక కార్డియాలజీ విభాగాన్ని నెలకొల్పడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు, గీతం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి, ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జిమ్‌సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వివిఎల్ నరసింహారావు, జిమ్‌సర్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతిపద్మజ, గీతం కార్డియాలజీ నిపుణులు డాక్టర్ గణేష్, డాక్టర్ పవన్ పాల్గొన్నారు.

ఎల్‌పిసిల జారీలో జాప్యం

ప్రజాశక్తి-పద్మనాభం : జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులకు ఎల్‌పిసిల జారీలో రెవెన్యూ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఎంపిపి కంటుబోతు రాంబాబు ఆరోపించారు. జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు ఇంటి వద్ద నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి దృష్టికి సమస్యను తెచ్చారు. దాదాపు 40రోజులైనా ఎల్‌పిసిలు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వ లక్ష్యం చేరుకోవడమూ కష్టమేనని వివరించారు.

సమస్యల పరిష్కారానికే గడపగడపకు...



ప్రజలకు సంక్షేమ పథకాల బ్రోచర్ ఇస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడం, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. గురువారం 46వ వార్డు అతిథి సంజీవయ్య కాలనీ, సంతోష్ నగర్ ప్రాంతాలలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, డైరెక్టర్లు రాయుడు శ్రీను, నూకరాజు, 46వ వార్డు నాయకులు బి.గోవింద్, కె.చిన్నా, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ఇఎస్ఐ ఆసుపత్రి వద్ద ధర్నా



సమావేశమైన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఇఎస్ఐలో మెరుగైన వైద్యం కోసం ఈనెల 26న మల్కాపురం ఆసుపత్రి వద్ద ధర్నాను జయప్రదం చేయాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్, సిఐటియు గౌరవాధ్యక్షులు. ఒవి రావు ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం ఎల్ఎంఎంఎం పార్కులో నిర్వహించిన విస్తృతస్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఇఎస్ఐలో వైద్యసేవలు తీసికట్టుగా మారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిగా రిఫరల్ ఆసుపత్రులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఆసుపత్రుల్లో వైద్యం నిలిచిపోయిందన్నారు.

రోగులకు కావాల్సిన మందులు బయటకొనుక్కోవాల్సిన దుస్థితి ఉందన్నారు. ఇఎస్ఐలో రూ.21వేలకు సీలింగ్ ఉండడంతో స్టీల్ ప్లాంట్‌లో 3426 మంది స్కిల్డు కార్మికులు పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. కేంద్ర.రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కలుగజేసుకుని సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్షులు జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు నమ్మి రమణ, చట్టి నర్సింగరావు, పి మసేను, పి వరహాలు, ఎన్.కృష్ణ, యు సోమేష్, కెపి సుబ్రహ్మణ్యం, పి నారాయణరావు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు ఘననివాళి



ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న టిఎన్‌టియుసి నేతలు

ప్రజాశక్తి -ములగాడ : హిందుస్తాన్ షిప్‌యార్డ్ టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ శతజయంతిని పురస్కరించుకుని షిప్‌యార్డు బస్‌స్టాప్ వద్ద ఎన్‌టిఆర్ చిత్రపటానికి యూనియన్ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు విళ్లా రామ్మోహనరావు, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ సెక్రటరీ ఎస్.చంటిబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షిప్‌యార్డ్ టిఎన్‌టియుసి అధ్యక్షులు ఎంవి.రమణమూర్తి, సెక్రటరీ సిహెచ్.రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ సేవలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను, తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేసిన సందర్భాలను గుర్తుకు తెచ్చారు కార్యక్రమంలో షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్‌తోపాటు ఐఎన్‌టియుసి, వైఎస్ఆర్‌టియు, సిఐటియు, ఎఐటియుసి, బిఎంఎస్, హెచ్ఎంఎస్,ఎస్‌సి,ఎస్‌టి అసోసియేషన్, బిసి అసోసియేషన్, ఇతర యూనియన్ల నేతలు పాల్గొన్నారు.

ఉన్నత పదవుల్లో బిసిలకు అన్యాయం

ప్రజాశక్తి-సీతమ్మధార : బిసిలే వెన్నెముక అని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పదవుల్లో బిసిలకు సముచిత స్థానం కల్పించడం లేదని బిసి సేన, విశాఖ నగర అధ్యక్షుడు పోతిబంతి హరిక్ష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలు, ఉన్నత విద్యాలయాల్లో విసిలు, రెక్టార్లు, రిజిస్ట్రార్లు వంటి కీలకపదవుల్లో బిసిలకు సముచిత స్థానం కల్పించడం లేదని అంతేకాకుండా సీనియారిటీ, రోల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీ ఉపకులపతిగా బిసి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించి, బిసిలకు ఉన్నతపదవుల్లో స్థానం కల్పించి న్యాయం చేయాలని కోరారు.

ఆటో కార్మికులపై వేధింపులు దుర్మార్గం



మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆరిలోవ : గడచిన మూడు నెలలుగా ఆటో కార్మికులపై రవాణాశాఖ అధికారులు దాడులు విస్తృతం చేసి, భారీ జరిమానాలను విధిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని, వాటిని వెంటనే ఆపాలని ఆరిలోవ జోన్ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆరిలోవ సిఐటియు కార్యాలయంలో ఆరిలోవ జోన్ ఆటో కార్మికుల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదాయం సమకూర్చుకోవడమే లక్ష్యంగా ఎంవిఐలకు టార్గెట్లు విధించి ఆటోలపై దాడులు చేయిస్తూ, భారీగా జరిమానాలను విధించి ఖజానా నింపుకోవాలని చూడడం దుర్మార్గమన్నారు. వాహనమిత్ర పేరుతో ఏడాదికి రూ.పదివేలు ఇచ్చి, అంతకు ఐదారు రెట్లుకు మించి అదే ఆటోడ్రైవర్ల నుంచి అపరాధ రుసుముగా వసూలు చేస్తున్నారన్నారు. ఆటోకార్మికులపై ప్రభుత్వ ప్రోద్బలంతో రవాణాశాఖ చేస్తున్న దాడులను వెంటనే ఆపకపోతే ఆర్‌టిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆరిలోవ ఆటో స్టాండ్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తిబాబు, సూరిబాబు, రమణ, రాజు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు



వార్డులో పర్యటిస్తున్న జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ

ప్రజాశక్తి -కరాస: పారిశుధ్య పనులపై అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు . గురువారం 52వ వార్డులోని శాంతినగర్ తదితర ప్రాంతాలలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని సమస్యలను, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ శ్రీధర్ కమిషనర్ దృష్టికి తెచ్చారు. వార్డు పరిధిలో ఓపెన్ డ్రైన్లు, సిసి రోడ్లు, పారిశుద్ధం, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ పనులను స్వయంగా పరిశీలించిన కమిషనర్, . ఈ సందర్భంగా సచివాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు చర్యలలో భాగంగా ప్రధాన గెడ్డలలో పూడికతీత పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. అన్ని శాఖలు, విభాగాల సమన్వయం, ప్రజల సహకారంతో పారిశుధ్య సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో డిఇఇ ఏడుకొండలు, జివిఎంసి సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎ.రాజేష్ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విస్తృత ప్రచారం



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీత

ప్రజాశక్తి - ఆరిలోవ : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం వార్డు పరిధిలోసామక్రిష్ణాపురం డాక్టర్ అంబేడ్కర్ గ్రామ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో 'ప్రభుత్వ పాఠశాలల ముద్దు, ప్రయివేటు స్కూల్ వద్దు, ప్రభుత్వ పాఠశాలలో విద్య, భవిష్యత్‌కు వెలుగు' అనే నినాదంతో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచుతూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మనబడి నాడు నేడు కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలన్నీ ప్రయివేటుకు ధీటుగా అభివృద్ధి చెందాయని, జగనన్న విద్యా కానుక, గోరుముద్ద, అమ్మ ఒడి వంటి పథకాలు అందరికీ వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అమ్మి రాజు, వార్డు వైసిపి ఇన్‌చార్జ్ కెల్ల సత్యనారాయణ, స్థానిక సంఘం అధ్యక్షులు వంకర బాబూరావు, కాకర గోవిందు, రండి గడ్డం నాయుడు, వీరబాబు, వెంకటేశ్వరరావు, సింహాచలం, స్కూలు కమిటీ చైర్మన్ ఎస్‌కె ఫాతిమా, వైస్ చైర్మన్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు రేషన్ కార్డులు ఇవ్వాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రిటైర్డు ఉద్యోగులు

ప్రజాశక్తి -గాజువాక : రిటైర్‌ఉద్యోగస్తులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం పెదగంట్యాడ తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విశ్రాంత ఉద్యోగులకు రూ.వెయ్యి నుంచి రూ.మూడు వేలలోపు మాత్రమే పెన్షన్ వస్తోందని, దీంతో జీవనం కష్టమౌతోందన్నారు.ఈ నేపథ్యంలో విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వపరంగా పెన్షన్ మంజూరుచేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.దీనబంద్, పెదగంట్యాడ శాఖ అధ్యక్షులు కణితి అప్పలరాజు, ఎన్‌వి రమణ, ఎన్ నాయుడు, వెంకటరావు, అప్పలస్వామి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం సబ్‌స్టేషన్ పరిధిలో 33/11కెవి విద్యుత్ లైన్ మరమ్మతులు, నిర్వహణ పనుల్లో భాగంగా ఈనెల 26న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఎఇ పిచ్చయ్య తెలిపారు. రెండో జోన్, ఎపిఇపిడిసిఎల్ ఇఇ బికె.నాయుడు ఆధ్వర్యంలో చేపట్టే మెయింటనెన్స్ పనుల్లో భాగంగా వాటర్ సప్లై పంప్ హౌస్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, బిహెచ్ఇఎల్, హెచ్‌డి సర్వీసెస్ ఫీడర్లలో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం



వెయిట్ లిఫ్టింగ్ క్రీడను ప్రారంభిస్తున్న కృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి -మాధవధార : క్రీడలతో విద్యార్థుల్లో మానసికోల్లాసంతోపాటు శారీరక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని ఐదో జోన్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ అన్నారు. గురువారం మాధవధార కనకదుర్గ కల్యాణ మండపంలో జివిఎంసి ఆధ్వర్యంలో శ్రీ మాధవ భారతి వెల్ఫేర్ అసోసియేషన్. నిర్వహణలో వేసవి క్రీడాశిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. జెడ్‌సి కృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో సెల్‌ఫోన్, టీవీలకే అతుక్కుపోతున్న పిల్లలకు ఇటువంటి క్రీడాశిబిరాల నిర్వహణ ఎంతో ఉపయుక్తమన్నారు. సంఘం అధ్యక్షులు కంచరాన సూర్యనారాయణ మాట్లాడుతూ వచ్చేనెల ఐదో తేదీ వరకు నిర్వహించే ఈ శిబిరంలో పిల్లలకు వివిధ ఆటల్లో తర్ఫీదునిచ్చి ఆడించడంతోపాటు జివిఎంసి ద్వారాఉచితంగా పౌష్టికాహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్ఒ. డాక్టర్ పి జగదీశ్వరరావు, 50వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల వరప్రసాద్, శ్రీ మాధవ్ యువజన సమాజం సహాయ కన్వీనర్ పప్పల రామచంద్రరావు, పి అప్పారావు, కె. శ్రీను, సనపల ఉమాపతి, సనపల నాగచంద్రుడు, పూజారి ఉదయ్‌కుమార్, స్పోర్ట్స్ అథారిటీ కోచ్ పూజారి శైలజ, బిజెపి నేత కెవి. రమణ, ఎంజి నాయుడు పాల్గొన్నారు,

బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న చైర్మన్ అప్పారావు

ప్రజాశక్తి- భీమునిపట్నం : బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు సీతారాం అన్నారు. ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, ఐసిడిఎస్, డిసిపియు, రెవెన్యూ, పోలీస్, పంచాయితీరాజ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐసిడిఎస్ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిషేధ చట్టం -2006 పై అవగాహన సదస్సు నిర్వహించారు. రాజకీయనేతల ఒత్తిళు ,, ప్రోద్బలంతో అత్యధిక శాతం బాల్య వివాహాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు.

బాల్యవివాహాలు చేస్తే రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ఎంపిపి డి వాసురాజు, తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్, మహిళా సంరక్షణ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం శ్రీదేవి, ఎస్ఐ భరత్‌కుమార్, ఎంఇఒ కెఎ బాలామణి పాల్గొన్నారుఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో బాలల హక్కుల రక్షణపై అవగాహన కల్పించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు సీతారాం ఎస్ఒఎస్ సిబ్బంది లక్ష్మణ్, సత్యనారాయణ పాల్గొన్నారు

29న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారానికి ఈ నెల 29న తలపెట్టిన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమానికి కూలీలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము పిలుపునిచ్చారు. మండలంలో కొండకర్ల, హరిపాలెం, పెదపాడు గ్రామాల్లో గురువారం ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశాలను ఆయన సందర్శించారు. ఉపాధి కూలీలతో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు కరపత్రాలు పంపిణీ చేసి ధర్నాకు రావాలని కోరారు. అనంతరం రాము మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్లో ఉపాధి హామీ పనులకు నిధులు తగ్గించడం దారుణమని, దీని వల్ల ఉపాధి కూలీలకు ఉపాధి కోల్పోవడం జరుగుతుందని చెప్పారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం వలన వేసవికాలంలో చేసే పనులకు ఇచ్చే అదనపు వేతనం తగ్గించారని, పనిముట్లుకు డబ్బులు ఇవ్వడం లేదని, టెంట్, మెడికల్ కిట్లు, మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించడం లేదని తెలిపారు. గతంలో వలే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు ఎంత కూలి ధర పడుతుందో స్లిప్పులు లిఖితపూర్వకంగా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్రావు, శ్రీను, సత్యవతి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు అప్పలరాజు

నక్కపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారానికి ఈ నెల 29న అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు కోరారు. మండలంలోని గురువారం పలు గ్రామాల్లో ఉపాధి పనులు జరుగు ప్రదేశాల్లో ఉపాధి కూలీలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పల రాజు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా చట్టంలో ఉన్న సదుపాయాలు తగ్గించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందన్నారు.దీన్ని కూలీ లందరూ వ్యతిరేకించాలన్నారు.ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో రెండు లక్షల కోట్లు నిధులు పెంచాలని, సంవత్సరానికి 200 రోజులు పని, రోజు వేతనం 600 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా 30 శాతం వేసవి అలవెన్స్, మంచి నీరు, పారా, గుణపం,తట్టలు, నీడకు టెంట్లు, మెడికల్ కిట్లు, మజ్జిగ పంపిణీ చేయాలని పాత పద్ధతిలో పనులు నిర్వహించాలన్నారు. పే స్లిప్ లు ఇచ్చి ప్రతివారం పేమెంట్లు చేయాలని తదితర డిమాండ్లతో జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధి కూలీలు కు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.నానాజీ పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 'అవినాష్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈ నెల 20, 21 తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో జరిగిన 10వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్-జూనియర్, జూనియర్ విభాగాల పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ ఛాంపియన్ షిప్ -2023 పోటీలలో అనకాపల్లి అవినాష్ పవర్ జిమ్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ జిమ్‌లో శిక్షణ పొందుతున్న ఇళ్ల ప్రవీణ్ కుమార్, అల్లబోయిన సురేష్ పతకాలు సాధించారు. సబ్-జూనియర్ బెంచ్ ప్రెస్ విభాగంలో 59కిలోల కేటగిరీలో 80 కిలోల బరువు ఎత్తి ఇళ్ల ప్రవీణ్ కుమార్ ప్రథమ స్థానం సాధించారు. జూనియర్ 66కిలోల కేటగిరీలో 107.5 కేజీల బరువు ఎత్తి అల్లబోయిన సురేష్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. వీరు జిమ్ శిక్షకులు గొర్లి స్వామీగౌడ్ పర్యవేక్షణలో శిక్షణ పొందారు. పతకాలు సాధించిన ప్రవీణ్, సురేష్‌ను జిమ్ ఛైర్మన్, న్యాయవాది ఐఆర్.గంగాధర్ గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జిమ్ సభ్యులు ఆళ్ల శ్రీనువాస్, షేక్ షరీఫ్, బుద్ధ గణేష్, రామరాజు, డాక్టర్ రాంబాబు, కె.శ్యామ్, ఎ.సూర్య, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభ్యుదయానికి పెద్దపీట

అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి-అనకాపల్లి

పరిపాలనా వికేంద్రీకరణతో గ్రామాభ్యుదయానికి పెద్దపీట వేస్తూ సాగుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎంపీ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. రూ.60 లక్షల ఎంపీ నిధులతో ఎలమంచిలి నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనుల దస్త్రంపై తొలి సంతకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పథకాలు ప్రజల వద్దకే తీసుకు వెళ్తూ, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లు గ్రామాలలోనే ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పథకాలను అమలు చేసే కార్యనిర్వాహక కేంద్రమైన కలెక్టర్ కార్యాలయంలో తన కార్యాలయం ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇప్పటివరకు జిల్లా అభివృద్ధికి రూ.10 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. 20 దత్తత గ్రామాలలో సోలార్ లైట్లు వేయడం జరిగిందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి పి వెంకటరమణ, ముఖ్య ప్రణాళిక అధికారి జి రామారావు మాట్లాడారు. ఎంపీ వివిధ శాఖల అధికారులను సన్మానించగా వారు ఎంపీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విష్ణుమూర్తి, పిఆర్ఈఈ వీరం నాయుడు, సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, మత్స్య శాఖ జెడి లక్ష్మణరావు, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులతో రైతులకు లాభం

ప్రజాశక్తి-అనకాపల్లి



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ సత్యవతి

విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి పేర్కొన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం ఇంక్యుబేషన్ సెంటర్‌కు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లం, చిరుధాన్యాలు, పనస విలువ ఆధారిత ఉత్పత్తులను ఈ కేంద్రం ద్వారా రూపొందించవచ్చని చెప్పారు. మూడు కోట్ల రూపాయలతో ఈ కేంద్రం నిర్మిస్తున్నామని, రైతు ఉత్పత్తి కేంద్రాల సంఘాలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో అనకాపల్లి బెల్లానికి గుర్తింపు ఉందన్నారు. ఈ సందర్భంగా పలు రైతు ఉత్పత్తి సంస్థలు తయారు చేసిన ఉత్పత్తులను, చెరకుపై ఆధునిక పద్ధతులపై ప్రచురించిన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఎల్ ప్రశాంతి, ఏడిఆర్ డాక్టర్ పివికే జగన్నాధరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఎన్టీఆర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పలక యశోద రవి, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, రైతు ఉత్పత్తి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంగన్‌వాడీ ఆయాకు విరిగిన చెయ్యి

- ప్రభుత్వం వైద్య ఖర్చులు ఇవ్వాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట నెంబర్-2 పాఠశాల వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తున్న దొడ్డి పద్మకు విధి నిర్వహణలో చెయ్యి విరిగింది. బుధవారం ఉదయం అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు వంట చేసి పాత్ర దించుతుండగా ఆయా పద్మ ముందుకు పడిపోయారు. దీంతో ఆమె చెయ్యి విరిగింది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం వండిపెడుతున్న క్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు గాయపడ్డా వారు సొంత డబ్బులతో వైద్యం చేయించుకోవడం తప్ప వారి వైద్యానికి అయ్యే ఖర్చును ప్రభుత్వం భరించడం లేదు. వైద్య ఖర్చులు ప్రభుత్వం చెల్లించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా తమలాంటి వాళ్ళకు ప్రభుత్వం సహాయం అందించాలని అంగన్వాడీ ఆయా పద్మ కోరారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం మేలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందాలని చౌడువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం కోరారు. మండలంలోని సింగన్నదొర పాలెం గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో గర్భిణులు, బాలింతలను పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవ పొందడానికి కావలసిన అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. డాక్టర్ ఇచ్చిన మందులు సకాలంలో వాడాలని, దాని వల్ల వ్యాధుల బారి నుండి రక్షించుకోవచ్చని తెలిపారు. గ్రామంలో దీర్ఘ కాలిక వ్యాధులైన బీపీ, షుగర్ పరీక్షలు అవసరం ఉన్నవారికి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఓ రాజశేఖర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

అనుమతుల్లేకుండా మెట్ట చదును

చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



మెట్టను జెసిబితో చదుచేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని దుడ్డుపాలెం గ్రామ సమీపన ఉన్న మెట్టను ఎటువంటి అనుమతులు లేకుండా యంత్రాలతో గత పది రోజులుగా చదును చేస్తున్నారు. ఎన్నో ఏళ్లగా ఉన్న ఈ కొండను తవ్వుతుండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. గ్రామస్థాయి నాయకుల కనుసన్నల్లో ఈ చదును చేసే కార్యక్రమం జరుగుతుండడంతో రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొండను తవ్వి దానిపై గుడిని నిర్మిస్తామని నాయకులు చెబుతున్నారు. గుడిని నిర్మించడానికి అంత పెద్ద ఎత్తున స్థలాన్ని చదును చేయడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. అయితే ఇక్కడ కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వచ్చి పాగా వేసేందుకు ఈ ప్రక్రియ మొదలు పెట్టారన్న అనుమానాలు కలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు వెంటనే కలుగజేసుకుని అనుమతులు లేకుండా కొండలు చదును చేస్తున్న ప్రక్రియను నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జగనన్న కాలనీలో లబ్ధిదారులు కానివారు ఇళ్ల నిర్మాణం

ఈ గ్రామంలో సర్వే నెంబరు 25లో 32 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల స్థలాలు కేటాయించారు. వారిలో 9 మంది ఇతర ప్రాంతాల్లో ఉండడం వల్ల వారి పేర్లను రద్దు చేశారు. వారికి కేటాయించిన స్థలాల్లో రెవెన్యూ అధికారులు అనుమతి లేకుండా కొత్తవారు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. దీనిపైనా రెవెన్యూ అధికారుల నుండి ఎటువంటి స్పందన కనపడలేదు.



సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చినతల్లి

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి

జీవీఎంసీ 84వ వార్డు కొత్తూరు నరసింగరావుపేటలో రూ.20 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి నీలబాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంత వాసుల విజ్ఞప్తి మేరకు రోడ్డు సమస్యను జీవీఎంసీ కమిషనర్, మేయర్ దృష్టికి తీసుకువెళ్లి, నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, దానబోయిన నీలకంఠరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ మందపాటి సునీత

27న గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-అనకాపల్లి

జివిఎంసి 82వ వార్డు, 4వ సచివాలయం పరిధి నర్సింగరావుపేటలో ఈ నెల 27న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేపడతారని ఆ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైసిపి అనకాపల్లి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు తెలిపారు. గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా నర్సింగరావుపేట టెలిఫోన్ ఎక్స్ఛేంజి వీధిలో రూ.26 లక్షలతో రహదారి, కాలువల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకటరమణ, సీఈవో ఈశ్వరి, ఈపిడి దొర, వైసిపి నాయకులు కొండూరి రవి, కుండల రామకృష్ణ, అల్లు త్రినాథ్, కూండ్రపు సత్తిబాబు, చవితిన నూకరాజు, నాగేశ్వరరావు, కోన ఉమ, సింగంపల్లి నాగరాజు, పేలూరు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బలిమెల నీటి వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయంలో నీటి నిల్వల వినియోగంపై ఇరు రాష్ట్ర అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒడిశా మల్కనగిరి జిల్లా చిత్రకొండ ఓహెచ్‌పిసి కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో పలు అంశాలపై సమీక్షించారు. 2022 -23 నీటి సంవత్సరంలో ఏయే రాష్ట్రం బలిమెల జలాశయం నుంచి ఎంతెంత నీటిని వినియోగించుకుందో లెక్కలు తేల్చారు. ఆంధ్ర వాటా 50.7236 టీఎంసీలు నీటిని, ఒడిశా 38.6593 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్లు తేల్చారు. దీని ప్రకారం ఒడిశా కంటే ఆంధ్ర కంటే 12.0643 టీఎంసీలు నీటిని అధికంగా వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్ రెండు జలాశయాల్లో 24.6270 టిఎంసిల నీటి నిల్వలు ఉన్నట్లు లెక్కించారు. ఆంధ్ర వాటా 6.2817 కాగా, ఒడిశా వాటా 8.3459 టీఎంసీలుగా పంపకాలు చేశారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాలు నీటి అవసరాలు నిమిత్తం 2000 క్యూసెక్కులు చొప్పున వినియోగించుకోవటానికి అధికారుల మధ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సమావేశంలో ఒడిశా తరుపున చీఫ్ కన్స్ట్రక్షన్ మేనేజర్ చంద్రశేఖర్ మిశ్రా, చిత్రకొండ ఎర్త్ డ్యాం డివిజన్ ఎస్ఈ సివిల్ రమాకాంత్, పాత్ర టెక్నికల్ వింగ్ డిప్యూటీ మేనేజర్ కృప సింధు బిశ్వాల్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మా శంకర్ సాహో, అసిస్టెంట్ ఇంజనీర్ గదాదర్ ప్రధాన్, ఆంధ్ర తరపున సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కెవి.ప్రశాంత్ కుమార్, ఈఈ జి.ప్రభాకర్, ఏఈ సిహెచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ పాలనలో దిగజారిన వ్యవసాయ కార్మికుల జీవన స్థితి

అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు సత్యదేవ్ రామ్





మాట్లాడుతున్న సంఘం జాతీయ అధ్యక్షులు సత్యదేవ్ రామ్, హాజరైన ప్రతినిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్రంలో బిజెపి 9 ఏళ్ల పాలనలో దేశంలోని వ్యవసాయ కార్మికుల జీవన పరిస్థితి నానాటికీ దిగజారుతోందని బీహార్ అసెంబ్లీలో సిపిఐఎంఎల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు సత్యదేవ్ రామ్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక న్యూ కాలనీ తాటికొండ నూకయ్యశెట్టి మెమోరియల్ హాల్‌లో గురువారం సంఘం 5వ రాష్ట్ర మహాసభ ప్రారంభమైంది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యదేవ్ రామ్ మాట్లాడుతూ దేశంలో పెద్ద సంఖ్యలో ఉన్న వ్యవసాయ కార్మికులు తమ హక్కులను సాధించుకోవాలంటే ఎర్రజెండా నీడన ప్రజా సంఘాల ఆధ్వర్యాన పోరాటం చేయడం తప్ప మరో మార్గం లేదని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం మతవాదం, ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ పేదల సమస్యలను పక్కతోవ పట్టిస్తుందని విమర్శించారు. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఇస్తున్నట్లు మిగిలిన రాష్ట్రాల్లో కూడా 200 యూనిట్లు వరకు విద్యుత్తు పేదలకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు రూ.3వేలు పింఛను ఇవ్వాలని, నిరుద్యోగులకు ప్రతినెలా రూ.1500 నిరుద్యోగ భృతి కల్పించాలని కోరారు. ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని, నాన్ షెడ్యూల్ ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్ ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి నైనాలశెట్టి మూర్తి, అనకాపల్లి పార్లమెంటు కార్యదర్శి పిఎస్.అజయ్ కుమార్ మాట్లాడారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాసభలో రాష్ట్రవ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగు ఖ్యాతి ఎన్‌టిఆర్‌తో విశ్వవ్యాప్తం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగువారి ఆత్మగౌరవాన్ని, ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేసిన ఘనత డాక్టర్ ఎన్‌టి.రామారావుకే దక్కుతుందని తెలుగుదేశం పార్టీ నేతలు వక్కాణించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, విశ్వ విఖ్యాత నటసార్వభౌమ కీర్తిశేషులు నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలు తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కమిటీ ఆధ్వర్యంలో పార్లమెంట్ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు సారథ్యంలో అనకాపల్లి పట్టణంలో సత్యాస్ లక్ష్మీ గ్రాండ్‌లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మరో పొలిట్ బ్యూరో సభ్యులు వంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్యేలు పప్పల చలపతిరావు, పీలా గోవింద సత్యనారాయణ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, టిడిపి నాయకులు శ్రీభరత్, దువ్వారపు రామారావు, బత్తుల తాతయ్య బాబు, పివిజి కుమార్, ప్రగడ నాగేశ్వరరావు, చింతకాయల విజయ్, లాలం కాశీనాయుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్లమెంట్ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతి అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రైతుల సమస్యలపై ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనకాపల్లి ఆర్‌డిఒ చిన్నికృష్ణ ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు సుమారు 500 ఎకరాల వాణిజ్య పంటను రైతులు నష్టపోయారని తెలిపారు. నువ్వులు, టమాట, పొద్దు తిరుగుడు పువ్వు, మొక్కజొన్న పండించిన అనకాపల్లి ఆవఖండంతోపాటు మునగపాక, అనకాపల్లి, కసింకోట మండలాల రైతులు పూర్తిగా నష్టాలు పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ప్రభుత్వం ఎటువంటి నష్టపరిహారం చెల్లించలేకపోవడం బాధాకరమన్నారు. మిగతా జిల్లాలలో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించిన ప్రభుత్వం అనకాపల్లి జిల్లాలో చెల్లించకపోవడానికి కారణాలు ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఈ విషయమై పరిశీలించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు విల్లూరి పైడారావు, డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, ఆడారి బుచ్చిరాము, బొబ్బిలి గోవిందరాజు, బొడ్డు సోమరాజు, బరిణికాన సూరిబాబు, సారిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమృతధార జలపాతం వద్ద పర్యాటకుల సందర్శన నిలిపివేత

ప్రజాశక్తి మారేడుమిల్లి : మండలంలోని ప్రముఖ్య పర్యాటక ప్రదేశమైన అమృతధార జలపాతం సందర్శనను తాత్కలికంగా మూసివేస్తున్నట్లు ఫారెస్ట్ రెంజ్ అధికారి ఎం.కరుణాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం అమృతధార జలపాతం వద్ద విహారయాత్రకు వచ్చిన పర్యాటకురాలిపై చెట్టు కొమ్మ పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రంపచోడవరం డిఎఫ్ఓ జి.నరేంద్రన్ ఆదేశాల మేరకు అమృతధార జలపాతం వద్ద మెరుగైన భద్రతపరమైన రక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జలపాతం వద్ద ఉన్న భారీ వృక్షాల కొమ్మలు, ప్రమాదకరంగా ఉన్న బండరాళ్లు తొలగించడం వంటి పనుల నిమిత్తం పర్యాటకుల సందర్శనను నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ఇక్కడకు వచ్చే పర్యాటకులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి- కశింకోట

రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ అన్నారు మండలంలోని వెదురుపర్తి గ్రామంలో గురువారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తిరిగి వైసిపిని గెలిపించాలని కోరారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ కృషి చేస్తున్నారన్నారు. అనంతరం మంత్రితో కలిసి వృద్ధురాలు కాండ్రేగుల జగ్గయ్యమ్మకు అర్హత పత్రం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్‌రాజు, డాక్టర్ విష్ణుమూర్తి, సర్పంచ్‌లు కలగా గున్నయ్య నాయుడు, శనివాడ అరుణ, ఎంపిడిఒ కొంకి అప్పారావు, వైసిపి నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



భవనాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం : మండలంలోని భోగాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రం, వివత్తుల సామాజిక భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో మండల కార్యాలయం వద్ద ప్రజలు సేవలు అందేవని, వాటిని వైసిపి ప్రతి గ్రామంలోనూ సచివాలయం ద్వారా అందిస్తుందని చెప్పారు. అనంతరం గంధవరం, వెంకన్నపాలెం, దుద్దుపాలెం, బుచ్చింపేట గ్రామాల వాలంటీర్లతో సమావేశాలు నిర్వహించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మాజీ జెడ్పిటిసి బొడ్డేటి సూర్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేధో వికాసానికి..

ఎంఆర్ కిట్లు దోహదం

జిల్లా సమగ్రశిక్ష సహిత విద్య సమన్వయకర్త శకుంతల


విభిన్న ప్రతిభావంతులు, ఉపాధ్యాయులతో శంకుతల


ప్రజాశక్తి -రావికమతం: బుద్ధి మాంద్యుల మేధో వికాసానికి ఎంఆర్ కిట్లు దోహదపడతాయని అనకాపల్లి జిల్లా సమగ్రశిక్ష సహిత విద్య సమన్వయకర్త శకుంతల తెలిపారు. చోడవరం భవిత కేంద్రంలో జాతీయ మేధో పరవైకల్య సాధికారత సంస్థ (సికింద్రాబాద్) జిల్లా విద్యాశాఖ - సమగ్ర శిక్ష సమన్వయంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా రావికమతం మండలానికి చెందిన 23 మంది బుద్ధిమాంద్య దివ్యాంగ విద్యార్థులకు 2 లక్షల 30వేల విలువైన బోధనోపకరణ సామగ్రి కిట్లను జాతీయ మేధోపర వైకల్య సాధికార సంస్థ ప్రతినిధులు కె.సుజిత్, శ్రీకాంత్‌ల చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మేడివాడ జడ్పీ హైస్కూలు ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులు బోధనోపకరణ సామగ్రిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలనిసూచించారు. తల్లిదండ్రులు కూడా ఇంటిదగ్గర ఈ బోధనోపకరణ సామాగ్రిని ఉపయోగించి పిల్లలకు సులభంగా బోధించవచ్చు అని అన్నారు. గతంలో మన మండలంలో 31 మంది దివ్యాంగ విద్యార్థులకు ఇవ్వడం జరిగిందని, ఇప్పుడు మరొక 23 మంది విద్యార్థులకు అందించడం జరిగిందన్నారు. జాతీయ మేధోపర వైకల్య సాధికార సంస్థ ప్రతినిధులు కే.సుజిత్ ,శ్రీకాంత్ లు మాట్లాడుతూ, బుద్ధి మాంద్యం గల మానసిక వికలాంగులకు తమ సంస్థ ద్వారా సహాయ పడటం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. వికలాంగులు కూడా సమాన స్థాయిలో మెలగాలన్న ఉద్దేశంతో తమ వంతుగా వారికి ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందన్నారు. సమాజంలో మానసిక వికలాంగులతో పాటు వారి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు పడుతున్న ఆవేదన అంతా ఇంతా కాదన్నారు. విభిన్న ప్రతిభావంతలకు అభ్యున్నతికి మరిన్ని సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడు, రావికమతం మండలానికి చెందిన దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు ఘన సత్కారం


వాలంటీర్‌ను సన్మానిస్తున్న కెకె రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాలన సాగిస్తున్నారని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె రాజు అన్నారు. గురువారం నక్కవానిపాలెం వివేకానంద కల్యాణ మండపంలో 14, 24 వార్డుల వాలంటీర్లకు మూడో జోన్ జివిఎంసి ఆధ్వర్యంలో సేవా అవార్డులను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ ప్రజల చెంతకు పాలనను అందించాలన్న లక్ష్యంతో సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థను ప్రారంభించిన సిఎం జగన్, ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, నిజాయితీ, నిష్పక్షపాతంగా ఉండాలనే నిరుద్యోగ యువతను పాలనలో భాగస్వాములను చేస్తూ వాలంటీర్లుగా నియమించిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ సంకల్పం, ఆశయానికి అనుగుణంగా వాలంటీర్లు పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తేవడమే కాకుండా, ఇతర రాష్ట్రాలకు ఆదర్శవంతంగా నిలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఎపిడి దుర్గాప్రసాద్, జెసిఎస్ మండల ఇంచార్జ్ మురళీకృష్ణ, కోడూరి సుశీల, బల్లా శ్రీనివాస్, కె.సత్యనారాయణ, సీతాకుమారి, బి.రామిరెడ్డి పాల్గొన్నారు.

పద్మనాభం : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందించడంలో వాలంటీర్ల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఉత్తమ సేవలతో అవార్డులు దక్కించుకున్న మండలంలోని 271మంది వాలంటీర్లను రెడ్డిపల్లిలోని జెడ్‌పిటిసి సుంకర సత్తిబాబు ఇంటి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ, చంద్రబాబు పాలన వస్తే, సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థలను ఇబ్బందులకు గురిచేసే పరిస్థితి ఉందని, ప్రతిఒక్కరూ ముందుజాగ్రత్తగా ఆలోచించాలన్నారు.కార్యక్రమములో ఎంపిపి కె రాంబాబు. వైసిపి మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ఉన్నారు.


పాయకరావుపేటలో...

పాయకరావుపేట: వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సత్యవరం గ్రామంలో ఎమ్మెల్యే గొల్ల బాబురావు చేతుల మీదుగా వాలంటీర్లను సన్మానించి అవార్డులను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే ప్రక్రియలో వాలంటీర్లు కీలకపాత్ర వారిదేనన్నారు. ఈ కార్యక్రమానికి ఇంత తక్కువ మంది వాలంటీర్లు హాజరు కావడం చాలా బాధాకరమని వివరించారు. ఈ సభకు హాజరు కాని వారు అందరికీ పాయకరావుపేటలో మీటింగ్ పెడతామని అక్కడికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండల చైర్మన్, ఉత్తరాంధ్ర ఎన్నికల పరిశీలకులు, రైతు విభాగ అధ్యక్షులు, చిక్కాల రామారావు, మండల పార్టీ అధ్యక్షులు ధనిశెట్టి బాబురావు, పబ్లిక్ ప్రచార వింగ్ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, మార్కెట్ యార్డ్ చైర్మన్ గుటూరు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల ఆవశ్యకతపై అవగాహన


నక్కపల్లిలో పుస్తకాలపై అవగాహన కల్పిస్తున్న ఆచార్యులు

ప్రజాశక్తి కోటవురట్ల: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శాఖ గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ పై చిన్నారులతో పుస్తకాలను చదివించారు. మాతృభాషతో పాటు ఇంగ్లీష్ భాషపై అవగాహన పెంచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పుస్తక సమీక్షలపై అవగాహన నిర్వహించారు. నక్కపల్లి హైస్కూలు తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు పుస్తక సమీక్షలు, రాయడంపై శిక్షణనిచ్చారు. పుస్తక సమీక్షల ఆవశ్యకతను తెలియజేశారు. పుస్తకంపేరు, రచయిత, పుస్తక సమీక్షకుడు, తరగతి, నివేదిక వంటి నియమాలను అనుసరించి పుస్తక సమీక్షలు ఎలా నిర్వహించాలో పిల్లలకు ఆచార్యులు సమగ్రంగా వివరించి అవగాహన కల్పించారు.

గొలుగొండ: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయ అధికారి రాజుబాబు ఆధ్వర్యంలో బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు రామకృష్ణ, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ శాఖ గ్రంథాలయంలో వేసవిజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. గురువారం విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. నీతి కథలు చదివించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఎం పద్మావతి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

కశింకోట: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సిహెచ్ వెంకట్రావు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో శిక్షణ ద్వారా మరింత విజ్ఞానం పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్ని విద్యార్థులకు డ్రాయింగ్, పాటలు నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి కే వరలక్ష్మి పాల్గొన్నారు.


గొలుగొండలో ఆడుతున్న చిన్నారులు

ములగాడ : చోరీకి ఆస్కారం లేని జ్ఞానసముపార్జనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర అధ్యక్షులు వై. హరిబాబు అన్నారు. గురువారం మల్కాపురంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ కష్టంగా కాకుండా, ఇష్టపడి చదవాలని, 20ఏళ్లు క్రమశిక్షణతో చదువుకు అంకితమైతే, మిగతా 80ఏళ్లు ఆనందమయంగా జీవించొచ్చన్నారు. బుద్ధ విహార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సిద్ధార్థ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బి.గౌతమ్ బాబు, కె.నరసింహారా, ప్రముఖ రచయిత కె.సత్తిరాజు, కార్మిక నాయకులు బి.సత్యానందం మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు అంబేద్కర్ జీవితచరిత్రపై ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో క్విజ్‌పోటీ నిర్వహించారు.


ఎంపిడిఒకు సామగ్రి ఇస్తున్న జగదీశ్వరరావు

అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి వితరణ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాక అంగన్వాడీ కేంద్రానికి ఎస్‌బిఐ ఆధ్వర్యంలో ఎస్ బిఐ రీజనల్ మేనేజర్ కోలా జగదీశ్వరరావు చేతుల మీదుగా ఎల్ఈడి టీవీ, ట్యాబ్, వాటర్ ప్యూరిఫైయర్, డెస్కులు, వాటర్ ట్యాంక్, మోటార్ ను గురువారం ఎంపీడీవో సీతారామరాజు, ఐసిడిఎస్ పిఓ శ్రీవిద్యకు అందజేశారు. అదే విధంగా భవనానికి పెయింటింగ్ వర్క్స్ చేసి, గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ, కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద అంగన్వాడీ కేంద్రానికి ఎస్‌బిఐ ఆర్థిక సాయంతో అంగన్వాడి కేంద్రం అభివృద్ధికి సామగ్రిని సమకూర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ ఎం.శ్రీలత, బ్రాంచ్ మేనేజర్ పి.సతీష్, పంచాయతీ కార్యదర్శి జయ ప్రకాష్, గోర్స శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'జగనన్న భూరక్ష'తో రైతులకు మేలు

ప్రజాశక్తి -రావికమతం: జగనన్న భూరక్ష భూహక్కు పథకంతో రైతులకు మేలు కలుగుతుందని కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి వరహాలు అన్నారు. మండలంలో కవగుంట గ్రామపంచాయతీ శివారు బుడ్డిబంధ రెవిన్యూలో సర్వే రాయి ఏర్పాటును ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కవగుంట పంచాయతీ శివారు బుడ్డి బంద రెవెన్యూలో 779 సర్వే హద్దు రాళ్లను వేయడం జరుగుతుందన్నారు. ఇటువంటి ఈ భూ సర్వే బ్రిటిష్ కాలంలో సుమారు 100 ఏళ్ళ క్రితం జరిగిందని తరువాత ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో డ్రోన్స్ సహాయంతో చేపడుతున్నారన్నారు. డి ఫార్మ్, జిరాయితీ భూములు, చెరువులు, గెడ్డ పోరంబోకులు, తదితర భూములన్నింటికీ సర్వే నిర్వహించి సరిహద్దు రాళ్ళను వేయడం జరుగుతుందన్నారు. సర్వే అనంతరం పక్కా సర్వే నెంబర్లతో రైతులకు పాస్ పుస్తకాలను అందించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ సతీష్, విఆర్వో సత్తిబాబు,వీఆర్‌ఏ శ్రీను, పలువురు రైతులు పాల్గొన్నారు.

పశువులకు వైఎస్ఆర్ బీమా

ప్రజాశక్తి-గొలుగొండ: పశువులకు ప్రభుత్వం వైఎస్ఆర్ బీమాను అందుబాటులోకి తెచ్చిందని కేడీపేట పశు వైద్యాధికారిని శిరీష తెలిపారు. ఏ ఎల్ పురం పశు వైద్యశాలలో గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. పశు బీమా చేస్తే సంకరజాతి ఆవు, గేదె, ఎద్దు మరణిస్తే రూ.30 వేలు, దేశవాళీ పశువులకు రూ.15 వేలు చెల్లిస్తారన్నారు. పాడి పశువులు ఒక ఈత ఈనిన వాటికే బీమా ఉంటుందన్నారు. ఆరు నెలలు దాటిన గొర్రెలకు, మేకలకు, పందులకు భీమా పొంది నష్టం సంభవిస్తే రూ.6 వేలు చెల్లిస్తారని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొరుప్రోలులో వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలలో కొరుప్రోలు గ్రామంలోని ఫ్యామిలీ పిజిషన్ కాన్సెప్ట్‌లో భాగంగా మెడికల్ క్యాంపును హెల్త్ వెల్నెస్ సెంటర్లో ఏర్పాటు చేశారు. పెనుగోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి రాజేశ్వరి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రోగులకు 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులు ఉచితంగా ఇస్తామన్నారు. అత్యవసరం అయితే అనకాపల్లి, కేజీహెచ్‌కు రిఫర్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ వెల్నెస్ సెంటర్ పర్యవేక్షకులు షేక్ అమీర్ షాజిద్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


పరీక్షిస్తున్న వైద్యులు



పరిశీలిస్తున్న ఎంపిడిఒ

పౌష్టికాహారం అందజేయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో రామచంద్ర పాలెం గ్రామంలో అంగన్వాడి కేంద్రాలను గురువారం ఎంపీడీవో చంద్రశేఖర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించడంతో పాటు పౌష్టికాహారం సరఫరా వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారాన్ని సకాలంలో అందజేయాలని, అదేవిధంగా ఆటలు ఆడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాఘవ, మాజీ సర్పంచ్ రాము, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక కొరతపై వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి ఇసుక ర్యాంపులో ఇసుకను అందుబాటులో ఉంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ నీరజ కు వినతి పత్రం అందజేశారు. గత వారం రోజులుగా ర్యాంపులో ఇసుక అందుబాటులో లేకపోవడంతో జగనన్న గృహ నిర్మాణాలు, ఇతర భవనాలు నిర్మాణం చేపట్టేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భవన నిర్మాణాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే అధికారులు స్పందించి ఇసుక అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం రాజేష్, నాయకులు ఎం.శ్రీను, సిఐటియు నాయకులు నానాజీ తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న కళాసీలు

నల్లబ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి-గొలుగొండ:13 నెలలుగా అలవెన్స్ ఇవ్వకపోవడంపై మండలంలోని కేడీపేట జీసీసీ కార్యాలయం వద్ద కళాశీలు నల్లబ్యాడ్జీలు పెట్టుకుని నిరసన చేపట్టారు. గురువారం ఏఐటియుసీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి లగుడు సీతయ్య నాయుడు అధ్యక్షతన ఈ నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణమూర్తి, సన్యాసిరావు, నాగేశ్వరరావు, సత్తిబాబు పాల్గొన్నారు.



బోల్తా పడిన లారీ

లారీ బోల్తా

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో లింగాపురం సెంటర్ వద్ద గురువారం ఉదయం లారీ బోల్తా పడింది. సరుగుడు కర్రలతో వెళ్తున్న లారీ సెంటర్ వద్ద కల్వర్టు వద్ద రంధ్రంలో వెనక చక్రాలు పడిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. తెల్లవారు సమయం కావడంతో సమీపంలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కల్వర్టు వద్ద ఏర్పడిన గుంతను సుమారు నాలుగు సంవత్సరాల నుంచి వదిలేయడం అధికారుల నిర్లక్ష్యమేనని స్థానికులు తెలిపారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

- విరిగిపడిన చెట్లు-పిడుగు పడటంతో వ్యక్తి మృతి



కోటవురట్లలో రోడ్డుపై నిలిచిన నీరు

బుచ్చయ్యపేట:గురువారం ఉదయం నుండి భానుడు తన ప్రతాపాన్ని చూపించగా, మధ్యాహ్నం ఒకసారిగా వాతావరణం చల్లబడి ఈదురు గాలులు, మెరుపులు ఉరుములతో భారీగా వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో రోడ్లన్నీ జలమయ్యాయి. ఈదురు గాలుల వల్ల మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం తదితర గ్రామాల్లో మామిడి తోటల్లో మామిడికాయలు నేల రాలిపోయాయి.

దేవరాపల్లి : మండలంలో బుధ, గురువారాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం రెండు గంటల వరకు తీవ్ర ఎండలు కాస్తున్నాయి. తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోతుంది. దట్టమైన మేఘాలు అలముకొని ఈదురుగాలులతో భారీ వర్షం కురుస్తుంది. గాలుల బీభత్సంతో పలు పంటలకు నష్టం వాటిల్లగా, విద్యుత్తు స్తంభాలు విరిగిపడి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుంది.

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలో గురువారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. కొంగసింగి గ్రామంలో పిడుగు పడటంతో ఆ శబ్దానికి ఒక వ్యక్తి హార్ట్ ఎటాక్ తో చనిపోయారు.

పలు గ్రామాల్లో చెట్లు విరిగి పోవడం, విద్యుత్ స్తంభాలు ఒరిగి పోవడం, విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. జానకిరామ్ పురం వద్ద విద్యుత్ వైర్ల పై చెట్టు విరిగి పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొత్త ఎల్లవరం గ్రామంలో పలు తాటి చెట్లు విరిగి రోడ్డుకి అడ్డంగా పడ్డాయి. ఈదురు గాలులకు జోగంపేట సమీపంలో విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి.



గొలుగొండలో విరిగిన చెట్టు

కోటవురట్ల:మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మూడు గంటల వరకు బానుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శించగా అనంతరం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని భారీ వర్షం కురిసింది. సుమారు మూడు గంటల పాటు వర్షం కురియడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారి, ఎంపీడీవో కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద రోడ్లపై నీరు ప్రవహించింది. దీంతో, ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



బుచ్చయ్యపేట మండలంలో కురుస్తున్న వర్షం

భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని నాగయ్యపేట పంచాయతీ శివారు సీతంపేట ఎస్సీ కాలనీలో వరద నీరు నిల్వ ఉండడంతో కాలనీవాసులు పలు ఇబ్బందులకు గురయ్యారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్య పరిష్కారం చేయాలని కాలనీవాసులు కోరారు.

అచ్యుతాపురం : ఉరుములు మెరుపులతో గురువారం సాయంత్రం వర్షం పడటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గురువారం ఉదయం నుంచి అత్యధిక వేడితో వాతావరణం వేడెక్కింది. సాయంత్రం నాలుగు గంటల వరకు వేడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా ఉరుములు మెరుపులు చల్లటి చినుకులు పడడంతో చల్లబడింది.

పిడుగు పడి వ్యక్తి మృతి



సత్తిబాబు మృతదేహం

గొలుగొండ: పిడుగు పడిన శబ్దానికి గుండెపోటు రావడంతో ఒక వ్యక్తి మృతి చెందారు. మండలంలో కొంగసింగి గ్రామంలో పిండి సత్తిబాబు(48) గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి సమీపంలో పిడుగు పడటంతో గుండెపోటుకు గురై మృతి చెందాడు.. తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట సమీపంలో ఉన్న బలబద్రపురం గ్రామానికి చెందిన పిండి సత్తిబాబు కొంగ సింగి గ్రామంలో అతని తోడల్లుడు కుమారుడైన వనిమిన సురేష్ ఇంటికి జన్మదిన ఫంక్షన్ కోసం వచ్చాడు. వర్షం పడే ముందు వాతావరణం చల్లబడడంతో గ్రామంలోని బయటకు వచ్చాడు. ఒకసారి గా వర్షం పెరిగి అతనికి సమీపంలో పిడుగు పడటంతో ఆ శబ్దానికి గుండుపోటుకు గురి అయ్యి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు కృష్ణదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. వైద్యాధికారులు అతని మృతిని ధ్రువీకరించడంతో ఆయన సొంత గ్రామానికి మృతదేహాన్ని తరలించారు.

కళలతో ప్రజా చైతన్యం

-సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు
-అలరించిన సిఐటియు మేడే ఉత్సవ మేళా



డ్యాన్స్‌తో ఆకట్టుకున్న ఝాన్సీ బృందం

ప్రజాశక్తి-ఉక్కునగరం : కళల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించవచ్చని, తద్వారా ఉద్యమాలను పెద్దఎత్తున ఉధృతం చేయొచ్చని సిపిఎమ్‌కు చెందిన 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు అన్నారు. ఉక్కునగరం అంబేద్కర్ కళాక్షేత్రంలో సిఐటియు ఆధ్వర్యంలో మేడే ఉత్సవాల మేళాను ఘనంగా నిర్వహించారు. కార్మిక వర్గంలో చైతన్య స్ఫూర్తిని రగిలించడానికి కళారూపాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటీకరణ చేస్తోన్న ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యాన్ని కలిగించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మేడే ఉత్సవాలలో ప్రదర్శనలు ఇచ్చేందుకు వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు కార్మికుల చైతన్యాన్ని రగిలించి, వారిని స్ఫూర్తిమంతం, ఉద్యమాలను మరింత ఉధృతం చేసే విధంగా సమాయత్తం చేసే లక్ష్యంగా కళారూపాలు రూపొందించడం, తమ ఆట, పాట ద్వారా కళాకారులు అద్భుతంగా ప్రదర్శించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మాదాల రంగారావు, టి.కృష్ణ సినీదర్శకులు, నటులు, ముఖ్యంగా కళాకారులు ఎంతోమంది విప్లవ స్ఫూర్తిని కలిగించే సినిమాలు తీసి ప్రజల్లో చైతన్యం కలిగించారన్నారు. 'విశాఖ ఉక్కును కొనేది ఎవడు అమ్మేది ఎవడు' అంటూ ప్రేక్షకుల హృదయాలను రగిలించి, రంజింపజేసే విధంగా సత్తిరెడ్డి, పల్సర్ బైక్ కండక్టర్ ఝాన్సీ, రమేష్ మాస్టారు ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. విశాఖ ఉక్కు పరిరక్షణకు నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు, ప్రజల్లో ఉద్యమస్ఫూర్తి నింపి, చైతన్యపరిచే దిశగా ఇటువంటి మేడే ఉత్సవాల మేళాలు దోహదపడతాయని గంగారావు అన్నారు. కార్యక్రమంలో పలు కళాబృందాలు పాల్గొని, వివిధ కళారూపాలను, కార్యక్రమాలను ప్రజలు ఆకట్టుకునే విధంగా చైతన్యవంతం చేసే విధంగా ప్రదర్శించారు .కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి, సిపిఎం జిల్లా అధ్యక్షులు కెఎం శ్రీనివాస్, స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, సీనియర్ నాయకులు ఎన్. రామారావు, బి.అప్పారావు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



కళాకారులను అభినందిస్తున్న అయోధ్యరామ్

కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -పాయకరావుపేట:నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, పొలిటికల్ బ్యూరో సభ్యురాలు, వంగలపూడి అనిత ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. పాయకరావుపేట గున్నయ్య శెట్టి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను, కళ్ళజోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న వెంకట్రావు

రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి :మండలంలోని చినదొడ్డి గల్లు లో గ్రంథాలయంను గురువారం ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సిహెచ్ వెంకట్రావు తనిఖీ చేశారు. వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహణపై అడిగి తెలుసుకుని గ్రంథాలయ రికార్డులను పరిశీలించారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా రోజువారి నిర్వహిస్తున్న కార్యక్రమాలను గ్రంథాలయ అధికారి జనార్ధన్ ను అడిగి తెలుసుకున్నారు. నక్కపల్లి, చినదొడ్డిగల్లు, ఉపమాకలో గ్రంథాలయ భవనాల మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదన ఉందన్నారు.